# బంగారం @ 85 వేలు

**ఒకేరోజు రూ.1,100 పెరిగిన పదిగ్రాముల ధర • నూతన గరిష్ఠానికి చేరుకున్న పుత్తడి విలువ**

న్యూఢిల్లీ, జనవరి 31: బంగారం భగభగమండుతున్నది. రోజుకొక రికార్డు స్థాయికి చేరుకుంటున్న పుత్తడి విలువ శుక్రవారం మరో ఉన్నత శిఖరాలకు చేరుకున్నది. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతోపాటు దేశీయంగా కొనుగోళ్లు ఊపందుకోవడంతో ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి. దేశ రాజధాని న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో శుక్రవారం ఒకేరోజు 99.9 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.1,100 పెరిగి చారిత్రక గరిష్ఠ స్థాయి రూ.85 వేలకు చేరువైంది. బులియన్ మార్కెట్ ముగిసే సమయానికి పదిగ్రాముల ధర రూ.84,900గా నమోదైంది. ధరలు ఈస్థాయికి చేరుకోవడం ఇదే తొలిసారని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వర్గాలు వెల్లడించాయి. జనవరి నెలలో బంగారం ధర రూ.5,510 లేదా 7 శాతం ఎగబాకింది. జనవరి 1న పుత్తడి ధర రూ.79,390గా ఉన్నది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల ధర రూ.1,100 అధికమై రూ.84,500 పలికింది. ఇటు హైదరాబాద్‌లోనూ బంగారం పరుగులు పెట్టింది. 24 క్యారెట్ పదిగ్రాముల ధర రూ.1,310 అధికమై రూ.84,330 పలికింది. అంతకుముందు ఇది రూ. 83 వేలుగా ఉన్నది. అలాగే 22 క్యారెట్ విలువ రూ.1,200 ఎగబాకి రూ. 77,300కి చేరుకున్నది.



### వెండి పరుగులు

పసిడితోపాటు వెండి పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో వెండి ధర రూ.95 వేలు పలికింది. కిలో ధర రూ.850 పెరిగినట్లు అయింది. అంతకుముందు ఇది రూ.94,150గా ఉన్నది. ఇటు హైదరాబాద్‌లో కిలో వెండి రూ.1,000 ఎగబాకి రూ.1.07 లక్షలు పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,800 డాలర్లు అధిగమించడం వల్లనే దేశీయంగా తొలిసారిగా 84 వేల మార్క్‌ను అధిగమించిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ సీనియర్ ఉన్నతాధికారి సౌమిల్ గాంధీ తెలిపారు. ఫ్యూచర్ ట్రేడ్ మార్కెట్లో ఫిబ్రవరి నెలకుగాను రూ.487 పెరిగి రూ.82,210 పలికిందన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో అతి విలువైన లోహాలపై సుంకాలు తగ్గిస్తే ధరలు తగ్గే అవకాశాలున్నాయన్నారు. మెక్సికో, కెనడాలపై అమెరికా సుంకాలను విధించడంతో పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను సురక్షితమైన బంగారం వైపు మళ్లిస్తుండటం కూడా ధరలు పెరగడానికి ప్రధాన కారణమని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. అలాగే పలు దేశాల సెంట్రల్ బ్యాంకులు వడ్డీరేట్లను తగ్గిస్తుండటం కూడా మరో కారణం.

## టెక్ మహీంద్రాకు ఊరట

హైదరాబాద్, జనవరి 31 (నమస్తే తెలంగాణ): సత్యం కంప్యూటర్స్ సంస్థను చేజిక్కించుకున్న టెక్ మహీంద్రా కంపెనీకి హైకోర్టులో ఊరట లభించింది. 2002–09 మధ్య కాలానికి సంబంధించి సత్యం కంప్యూటర్స్ చెల్లించాల్సిన ఆదాయ పన్నును ఆ కంపెనీ వాస్తవ ఆదాయం ఆధారంగానే లెక్కించాలని శుక్రవారం హైకోర్టు తీర్పు చెప్పింది. సత్యం కుంభకోణం నేపథ్యంలో ఆ కంపెనీ వాస్తవ ఆదాయం ఆధారంగా పన్ను మదింపునకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ హైకోర్టులో 'టెక్ మహీంద్రా' దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ పీ శ్యాంకోశీ, జస్టిస్ ఎన్ తుకాంజీలతో ధర్మాసనం విచారణ జరిపింది.

## జిల్లాకేంద్రాల్లో స్కిల్ సెంటర్లు

హైదరాబాద్, జనవరి 31 (నమస్తేతెలంగాణ): తెలంగాణను స్కిల్స్ క్యాపిటల్ ఆఫ్‌ది గ్లోబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్రంలోని అన్ని జిల్లాకేంద్రాల్లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి శ్రీధర్‌బాబు ప్రకటించారు. శుక్రవారం డార్క్ మేటర్ టెక్నాలజీస్ పేరిట కెనడాకు చెందిన సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏర్పాటు చేసిన గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు.

# ఒకేసారి ఓలా 8 స్కూటర్లు

**రూ.79,999 నుంచి రూ.1.69 లక్షల ధరల శ్రేణిలో**

న్యూఢిల్లీ, జనవరి 31: ఎలక్ట్రిక్ స్కూటర్ల తయారీ ఓలా స్పీడ్ పెంచింది. ఒకేరోజు ఎనిమిది రకాల స్కూటర్లను మార్కెట్‌కు పరిచయం చేసింది. ఎస్1 బ్రాండ్‌తో విడుదల చేసిన ఈ స్కూటర్లు రూ.79,999 మొదలుకొని రూ.1,69,999 గరిష్ఠ ధరతో లభించనున్నాయి. జనరేషన్ 3 ప్లాట్‌ఫాంలో భాగంగా అభివృద్ధి చేసిన ఈ స్కూటర్లు వినియోగదారుల అభిరుచికి తగ్గట్టుగా తీర్చిదిద్దినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఎస్1 ఎక్స్, ఎస్1 ఎక్స్+, ఎస్1 ప్రొ, ఎస్1ప్రొ+ పేర్లతో నాలుగు రకాల స్కూటర్లను తెచ్చింది. వీటిలో 5.3 కిలోవాట్ల బ్యాటరీతో



తీర్చిదిద్దిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 320 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. అలాగే 4 కిలోవాట్లా బ్యాటరీ కలిగిన మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 242 కిలోమీటర్ల దూరం వెళ్లనున్నది.

## తగ్గిన యమహా బైకుల ధరలు

న్యూఢిల్లీ, జనవరి 31: స్పోర్ట్స్ బైకుల తయారీ సంస్థ యమహా మోటర్స్..వాహన కొనుగోలుదారులకు శుభవార్తను అందించింది. తన ఫ్లాగ్‌షిప్ మాడల్స్ ఆర్3, ఎంటీ–03 మాడళ్ల ధరలను రూ.1.10 లక్షల వరకు తగ్గించింది. ఈ ధరలు శనివారం నుంచి అమలులోకిరానున్నాయి. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఆర్3 మాడల్ రూ.3,59,900, ఎంటీ–03 మాడల్ ధర రూ.3,49,900కి తగ్గనున్నాయి. ఈ ధరలు ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి. ప్రీమియం మోటర్‌సైకిళ్లకు డిమాండ్ పెంచాలనే ఉద్దేశంతో ఈ రెండు మాడళ్ల ధరలను తగ్గించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



## నెమ్మదించిన కీలక రంగాలు

**డిసెంబర్ నెలలో 4 శాతం వృద్ధి**

న్యూఢిల్లీ, జనవరి 31: కీలక రంగాలు మళ్లీ నెమ్మదించాయి. డిసెంబర్ నెలకుగాను కీలక రంగాల్లో వృద్ధి 4 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే నెలలో నమోదైన 5.1 శాతంతో పోలిస్తే భారీగా తగ్గగా, అలాగే వరుస నెల నవంబర్ నెలతో పోలిస్తే 4.4 శాతాని కంటే తగ్గింది. సహజ వాయువు ఉత్పత్తి ప్రతికూలానికి పడిపోవడంతోపాటు బొగ్గు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్ ఉత్పత్తి భారీగా పడిపోయినట్లు కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. బొగ్గు ప్రొడెక్షన్ 10.8 శాతం నుంచి 5.3 శాతానికి పడిపోగా, రిఫైనరీ ఉత్పత్తులు సగానికి సగం 2.8 శాతానికి దిగిరాగా, ఎరువులు వృద్ధి 1.7 శాతం నమోదైనట్లు తెలిపింది. కానీ, సిమెంట్ 4 శాతం వృద్ధి నమోదుకాగా, విద్యుత్ 5.1 శాతం వృద్ధి కనబరిచాయి. అలాగే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ మధ్యకాలానికిగాను కీలక రంగాలు 4.2 శాతానికి పరిమితమయ్యాయి.

## హైదరాబాద్ టూ పుకెట్‌కు డైరెక్ట్ ఫ్లైట్

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 31 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నుంచి థాయ్‌లాండ్‌లోని పుకెట్ నగరానికి విమాన సర్వీస్ ప్రారంభమైంది. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి తొలి విమానం శుక్రవారం టేకాఫ్ అయినట్టు జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ సీఈవో ప్రదీప్ తెలిపారు. కొత్త సర్వీస్‌తో పుకెట్–హైదరాబాద్ మధ్య కనెక్టివిటీ ఘననీయంగా పెరుగుతుందని తెలిపారు. ఈ విమానం 3:45 గంటల్లో గమ్యాన్ని చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రతి బుధ, శుక్ర, ఆదివారాల్లో ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ విమానం మూడు సర్వీసులను నడుపుతుందని తెలిపారు.

















